ఎక్కడ చూసినా చెత్త కుప్పలే!

వ్యర్థాలతో నిండిపోతున్న కొత్త బస్టాండ్ పరిసరాలు

- రోడ్ల వెంట కుప్పలుగా పోస్తున్న వైనం
- స్వైరవిహారం చేస్తున్న పందులు
- పట్టించుకోని అధికారులు



బస్టాండ్ పక్కన రోడ్డుపై పడేసిన వ్యర్థాలు

ఖమ్మంమయూరిసెంటర్: నగరంలోని కొత్త బస్టాండ్ చుట్టుపక్కల ప్రాంతం అపరిశుభ్ర వాతావరణం తాండవిస్తోంది. ఎక్కడ చూసినా రోడ్ల వెంట చెత్తాచెదారం పడేసి ఉన్నాయి. దీంతో అటుగా ప్రయాణిస్తున్న వారు కొంత ఇబ్బందికి గురవుతున్నారు. అక్కడ డంప్ చేసిన చెత్తను తరలించడం లేదు. దీంతో అక్కడ రోజుల తరబడి ఉంటోంది. దీంతో కుళ్లిపోయిన వాసన వస్తోంది.

కుప్పలుగా పేరుకుపోయి..

బస్టాండ్ పరిసర ప్రాంతాల్లో ప్రధానంగా బస్టాండ్ పక్కన ఉన్న విద్యుత్ ఉపకేంద్రం రోడ్డులో అలాగే వెనుక భాగంలో కూడా వ్యర్థాలు పోస్తున్నారు. ప్లాస్టిక్ వ్యర్థాలన్నీ కుప్పగా పోయటంతో రోజులు గడిచినా కూడా అలాగే ఉండి ఆ ప్రాంతమంతా భరించలేని దుర్వాసన వెదజల్లుతోంది. అలాగే ఎక్కువగా ప్లాస్టిక్ క్యారీబ్యాగ్‌లు, కవర్లు ఉండటంతో గాలికి అవి ఒకచోట నుంచి మరోచోటుకు కొట్టుకెళ్తున్నాయి. దీంతో ఆ ప్రాంతమంతా ఈ వ్యర్థాలే కనిపిస్తున్నాయి.

ఎవరిదీ నిర్లక్ష్యం..

బస్టాండ్‌లో ఉన్న షాపుల నిర్వాహకులు ప్రతీరోజు ఇలాంటి ప్లాస్టిక్ వ్యర్థాలను రోడ్డు వెంట పడేస్తున్నారనే చర్చ సాగుతోంది. ఎక్కువగా ప్లాస్టిక్ ఉండటంతో షాపుల యజమానులే ఇలా చేస్తున్నట్టు తెలుస్తోంది. ఏ రోజుకు ఆరోజు పక్కన పెట్టి డంపింగ్‌యార్డుకు తరలించాల్సిన చెత్తను ఇలా రోడ్ల వెంట వేయడంతో పరిసర ప్రాంతాలన్నీ కలుషితం అవడంతోపాటు పందులు, కుక్కలు పొర్లుతున్నాయి. దీనివల్ల చెత్త రోడ్డంతా అవుతోంది.

పట్టించుకోని సిబ్బంది..



కొత్త బస్టాండ్‌కు కూతవేటు దూరంలోనే కేఎంసీ కార్యాలయం ఉంది. ఈ రోడ్డులోనే కార్పొరేషన్ అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది తిరుగుతూ ఉంటారు. అయినా ఇక్కడ చెత్తను మాత్రం వారు పట్టించుకోవడంలేదు. ప్రతీ రోజు నగరం మొత్తం శుభ్రం చేస్తున్న శానిటేషన్ సిబ్బంది ఇక్కడ మాత్రం పట్టించుకోవడం లేదు. ఒకటి, రెండు రోజుల తర్వాత కూడా ఇక్కడి చెత్తను తొలగించకపోవడంతో పరిస్థితి అధ్వానంగా మారుతోంది. బస్టాండ్‌తోపాటు పరిసర ప్రాంతాలను కూడా శుభ్రంగా ఉంచుకోవాల్సిన ఆర్టీసీ అధికారులు చుట్టుపక్కల ఎలా ఉందో కూడా కనీసం గమనించడం లేదు. చెత్తను ఎక్కడ పడితే అక్కడ పోయవద్దని షాపు యజమానులను కూడా హెచ్చరించకుండా ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారు. దీనివల్ల అటు ప్రజలు,ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

వ్యర్థాలను తొలగించాలి..



నిత్యం ప్రయాణికులు రద్దీతో ఉండే బస్టాండ్ పక్కన గల రోడ్ల పక్కనే చెత్తాచెదారం పడవేస్తున్నారు. వీటి వల్ల అటు నుండి ప్రయాణించే సమయంలో ఇబ్బందులు పడాల్సి వస్తుంది. వ్యర్థాలు రోడ్ల వెంట పోయకుండా మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోవాలి. రోడ్ల వెంట వ్యర్థాలు పోస్తుండడంతో ఈ ప్రాంతంలో పందులు సంచరించి అపరిశుభ్ర వాతావరణానికి దారితీస్తోంది.

– బోడపట్ల సుదర్శన్,
సీపీఎం ఖమ్మం టూటౌన్ కార్యదర్శి

సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు

- ప్రజావాణిలో మేయర్ నీరజ



ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న మేయర్ నీరజ

ఖమ్మంమయూరిసెంటర్: సమస్యలపై ప్రజావాణికి వచ్చే ప్రజల సమస్యలను తక్షణమే పరిష్కరించేలా ఏర్పాట్లు చేశామని, ప్రజావాణిలోనే వినతులను పరిశీలించి అక్కడే అధికారులు వాటిని పరిష్కరిస్తారని మేయర్ పునుకొల్లు నీరజ అన్నారు. సోమవారం కేఎంసీ గ్రీవెన్స్‌లో ప్రజల నుండి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... ప్రజావాణిలో అన్ని విభాగాల అధికారులు ప్రజలకు అందుబాటులో ఉంటారన్నారు. ఇంకా ఇందిరమ్మ ఇళ్ల సర్వే కోసం తమ వద్దకు అధికారులు రావడంలేదని ప్రజలు మేయర్ దృష్టికి తీసుకురాగా.. ఈ నెలాఖరు వరకు సర్వే కొనసాగుతుందని, దరఖాస్తు చేసుకున్న అందరి ఇళ్లకు అధికారులు వస్తారన్నారు. అంతక ముందు ట్రెయినీ కలెక్టర్ మ్రినాల్ శ్రేష్ట ప్రజావాణిని పరిశీలించారు. 53వ డివిజన్‌లో మంచినీటిని సక్రమంగా విడుదల చేయడం లేదని, స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సీపీఎం డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో ట్రెయినీ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. అలాగే కార్పొరేషన్ కార్యాలయం నుంచి ఆర్టీఓ కార్యాలయం మీదుగా బైపాస్‌కు వెళ్లే రహదారిని విస్తరించాలని కోరారు. హాయ కమిషనర్ మహమ్మద్ షఫీ ఉల్లా, అకౌంట్ ఆఫీసర్ శివలింగం, మేనేజర్ విజయానంద్, ఏసీపీ వసుంధర, డీఈఈ మాధవి, ఆర్ఐ జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేటర్ భర్తపై ఫిర్యాదు

నగరంలోని 40వ డివిజన్ ఇందిరమ్మ ఇండ్ల సర్వే సక్రమంగా జరగడం లేదని, స్థానిక కార్పొరేటర్ భర్త దాదే సతీష్ సర్వే సిబ్బందితో కుమ్మక్కై ప్రభుత్వాన్ని తప్పుదోవ పట్టిస్తున్నారని డివిజన్ ఇందిరమ్మ ఇళ్ల కమిటీ సభ్యులు సోమవారం మేయర్ నీరజకు ఫిర్యాదు చేశారు. దాదే సతీష్ తనకు అనుకూలంగా ఉన్న వ్యక్తులకు సర్వే చేయిస్తున్నారని, విచారణ చేయించి చర్యలు తీసుకోవాలన్నారు. గద్దె కొప్పుల ఆనందరావు, అబ్దుల్ ఆహాద్, అజీమ్, జావిద్, గోపి, సమీర్ తదితరులు పాల్గొన్నారు.

ఏడాది గడుస్తున్నా అమలు కాని హామీలు



మాట్లాడుతున్న వెంకటేశ్వరరావు

ఖమ్మం మామిళ్లగూడెం: మధ్యాహ్న భోజన కార్మికులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కల్యాణ వెంకటేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మధ్యాహ్న భోజన కార్మికుల యూనియన్ సీఐటీయూ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా కలెక్టరేట్ ఎదుట సమస్యల పరిష్కారానికి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కాంగ్రెస్ అధికారంలోకి వస్తే సరుకులు మొత్తం స్కూళ్లకు ప్రభుత్వమే సరఫరా చేసి కార్మికులకు వేతనం రూ.10,000 ఇస్తామని హామీ ఇచ్చారని, అధికారం చేపట్టి ఏడాది కావస్తున్న నేటి వరకు అమలు చేయలేదని మండిపడ్డారు. వెంటనే ప్రస్తుతం జరిగే అసెంబ్లీ సమావేశాలలో మధ్యాహ్న భోజన కార్మికులకు బడ్జెట్ కేటాయించి రూ.10 వేల వేతనాలు వేయాలన్నారు. పెండింగ్ లో ఉన్న వంట బిల్లులతో పాటు పది నెలల నుండి కోడిగుడ్డు బిల్లులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. మధ్యాహ్న భోజన కార్మికులకు ప్రభుత్వ సబ్సిడీపై గ్యాస్ సిలిండర్, కాటన్ శారీస్ రెండు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు ఎర్ర శ్రీకాంత్, శ్రామిక మహిళ జిల్లా కన్వీనర్ పిన్నింటి రమ్య, జిల్లా సహాయ కార్యదర్శి పెరుమాళ్ళపల్లి మోహన్‌రావు, వసపొంగు వీరన్న, ఏర్పుల రాములు, కే.నరేంద్ర, భద్రమ్మ, రాధమ్మ, శ్రీలక్ష్మి, వరలక్ష్మి, గంగమ్మ, దుంపల లక్ష్మి, పద్మ రాణి తదితరులు పాల్గొన్నారు.

'చలోఅసెంబ్లీ'ని జయప్రదం చేయండి



మాట్లాడుతున్న వెంకటేష్

ఖమ్మం మామిళ్లగూడెం: విద్యారంగంపై ప్రభుత్వం అనుసరిస్తున్న నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ, సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించే 'చలో అసెంబ్లీ' కి విద్యార్థులంతా పాల్గొని విజయవంతం చేయాలని సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేష్ పిలుపునిచ్చారు. సోమవారం చలో అసెంబ్లీ కార్యక్రమానికి వెళ్తూ ఖమ్మం రైల్వేస్టేషన్‌లో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వ పాలన ఏడాది పూర్తి చేసుకున్నప్పటికీ విద్యారంగ సమస్యలు పరిష్కారానికి నోచుకోలేదని ఆందోళన వ్యక్తం చేశారు. నేటికీ విద్యారంగానికి కనీసం విద్యాశాఖ మంత్రిని కేటాయించలేదన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు యశ్వంత్, నసీర్, తిమ్మిడి రఘు, వెంకటేష్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రం వద్ద రైతుల ఆందోళన



ఆందోళన చేస్తున్న రైతులు

నేలకొండపల్లి: కొనుగోలు కేంద్రంలో తేమ శాతంలో వివక్ష చూపుతున్నారని స్థానిక రైతులు ఆందోళన చేపట్టారు. మండలంలోని మంగాపురతండాలో ఏర్పాటుచేసిన కొనుగోలు కేంద్రం నిర్వాహకులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని సోమవారం కేంద్రం వద్ద ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. కేంద్రం నిర్వాహకులకు అనుకూలంగా ఉన్న వారికి తేమ శాతం లేకున్నా కాంటాలు వేస్తున్నారని, కాంటాలు కూడా సీరియల్‌గా వేయటం లేదని మండిపడ్డారు. గన్నీ సంచులతో కాంటాలు జాప్యం అవుతుందని నిరసన వ్యక్తం చేశారు విషయం తెలుసుకున్న సొసైటీ చైర్మన్ బాలాజీ రైతులతో మాట్లాడారు. సొసైటీ కార్యదర్శి రామకోటయ్యను వివరణ కోరగా ఎలాంటి వివక్ష లేదని, గన్నీ సంచులు ఆలస్యంగా రావటంతో కాంటాలు ఆలస్యమైందన్నారు.

ఘనంగా చర్చి వార్షికోత్సవం



ప్రార్థనలు చేస్తున్న సంఘస్తులు

కామేపల్లి: మండలంలోని కొత్తలింగాల గ్రామంలోని అద్భుత దివ్యబాల యేసు చర్చి వార్షికోత్సవ వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఫాదర్ మేడికొండ ఫ్రాన్సిస్ దుంపల బాలస్వామి, విచారణ గురువులు మారియో ఫాదర్ పాల్గొన్ని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో సంఘ పెద్దలు పగిడిపల్లి ప్రభాకర్, గాజుల ముత్తమ్మ, హెచ్చు రాంబాబు, తిప్పారపు జమ్మలమ్మ తదితరులు పాల్గొన్నారు.

పోలీసులకు అభినందనలు

నేలకొండపల్లి: మండల కేంద్రం లోని దంపతులు హత్య కేసును చేధించిన పోలీస్ అధికారులకు వాసవి సేవా సమితి జిల్లా అధ్యక్షుడు పసుమర్తి శ్రీనివాస్ సోమవారం ఒక ప్రకటనలో అభినందనలు తెలిపారు. హత్య కేసును తక్కువ సమయంలో చేధించేందుకు కృషి చేసిన సిబ్బందికి శుభాకాంక్షలు తెలిపారు.

రైతులపై దాడి అప్రజాస్వామిక చర్య



మాట్లాడుతున్న గుర్రం అచ్చయ్య

ఖమ్మంమయూరిసెంటర్: సమస్యలు పరిష్కరించాలని ఢిల్లీ సరిహద్దులో శాంతియుతంగా పాదయాత్ర చేస్తున్న రైతులపై పోలీసులు అడ్డగించి భాష్ప వాయువును ప్రయోగించి దాడి చేయడం అప్రజాస్వామిక చర్య అని ఏఐకేఎస్ రాష్ట్ర నాయకులు గుర్రం అచ్చయ్య అన్నారు. సోమవారం ఖమ్మంలోని రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన సంఘ జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కనీస మద్దతు ధర గ్యారంటీ హక్కు చట్టబద్ధం చేసి స్వామినాథన్ కమిషన్ సిఫారసుల ప్రకారం అన్ని పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించాలని కోరారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం అనేక వాగ్దానాలు చేసి అధికారంలోకి వచ్చి హామీలు అమలు చేయడం లేదని విమర్శించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న రైతు, ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఉద్యమించాలన్నారు. ఈ సమావేశంలో సంఘ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మలీదు నాగేశ్వరరావు, ఆవుల వెంకటేశ్వర్లు, కోలేటి నాగేశ్వరరావు, కమ్మకోమటి నాగేశ్వరరావు, పాశం అప్పారావు, మారుతి మల్లయ్య, ధరావత్ తేజ, వడ్డే వెంకటేశ్వర్లు, కేలోతు లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

దేవాలయ అభివృద్ధికి పాటుపడతాం



ప్రమాణ స్వీకారం చేయిస్తున్న అధికారులు

నేలకొండపల్లి: దేవాలయం అభివృద్ధికి పాటుపడుతామని శ్రీ సీతామచంద్రస్వామి దేవస్థానం నూతన కమిటీ పాలకవర్గం పేర్కొంది. మండలంలోని మండ్రాజుపల్లి శ్రీ సీతారామచంద్ర స్వామి దేవస్థానం చైర్మన్‌గా బొర్రా కృష్ణారావు, సభ్యులుగా తుమ్మా ఉపేందర్‌రావు, నెల్లూరి రంగనాయకమ్మ, జిల్లా ఉపేందర్, గుండు వెంకన్నలు సోమవారం ప్రమాణస్వీకారం చేశారు. దేవాదాయ శాఖ ఇన్స్పెక్టర్ అనిల్‌కుమార్, కార్యదర్శి శ్రీకాంత్ ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా నూతన కమిటీని పలువురు సన్మానించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ సీతారాములు, నాయకులు కొర్లకుంట్ల నాగేశ్వరరావు, గోవిందరావు, రమేష్, భద్రయ్య, జెర్రిపోతుల అంజిని, బచ్చలకూరి నాగరాజు, బోయిన వేణు, యడవల్లి నాగరాజు పాల్గొన్నారు.

వృత్తికి వన్నె తెచ్చేలా విధులు



సన్మానిస్తున్న దృశ్యం

రఘునాథపాలెం: తల్లిదండ్రులతో సమానమైన ఉపాధ్యాయులు వృతికి వన్నె తెచ్చేలా విధులు నిర్వర్తిస్తే విద్యార్థులు, గ్రామస్తుల మన్ననలు అందుతాయని పీఏసీఎస్ చైర్మన్ రావూరి సైదబాబు, పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు వై.వెంకటేశ్వరరావు అన్నారు. ఇటీవల పదవీ విరమణ పొంది మండలంలోని వీవీ పాలెం ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం వేమిశెట్టి మోహన్‌దాస్, బదిలీ ఉపాధ్యాయుడు రాయల నర్సింహారావును స్థానిక రైతువేదిక సోమవారం సన్మానించారు. మాజీ ఎంపీటీసీ యరగర్ల హన్మంతరావు, మాజీ సర్పంచ్ రావెళ్ల మాధవి, హెచ్‌ఎంలు కె.శ్రీమన్నారాయణ, వీరకుమారి, కుతుంబాక సీతారాం, బానోత్ కిషోర్, తొలపనూరి దానయ్య, ఆవుల జానకీరామయ్య, తగరం నాగరాజు, కుతుంబాక సత్యనారాయణ, అమరనేని వెంకటేశ్వర్లు, గంగవరపు శివరామకృష్ణ పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి



విద్యాసాగర్‌కు పత్రాలు అందజేస్తున్న నాయకులు

ఖమ్మం మామిళ్లగూడెం: బీజేపీ బలోపేతానికి కృషి చేయాలని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి ధనియాకుల వెంకటనారాయణ యాదవ్ కోరారు. ఈ మేరకు సోమవారం 53వ డివిజన్‌లో పోలింగ్ బూత్‌ల్లో పార్టీ కమిటీలు వేసి దీనికి సంబంధించిన పత్రాలను పార్టీ ఖమ్మం రెండో పట్టణ అధ్యక్షుడు తాజ్‌నూత్ భద్రం ఆధ్వర్యంలో బీజేపీ జిల్లా ఎలక్షన్ ఆఫీసర్ గెంటాల విద్యాసాగర్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో శ్రీలత, తొడుపునూరి రవీందర్, రేపాకుల సైదులు, నాగేందర్, సాయి, దాసరి వీరభద్రం, మల్లికార్జునరావు, వెంకటేశ్వర్లు, ఉపేంద్ర, ఆసిఫ్, దుద్దుకూరు అశోక్ పాల్గొన్నారు.

ధనుర్మాస పూజలు



పూజలు నిర్వహిస్తున్న భక్తులు

ఖమ్మంగాంధీచౌక్: నగరంలోని శ్రీ రంగనాథ క్షేత్రంలో సోమవారం ధనుర్మాస పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు బూరుగడ్డ శ్రీధరాచార్యులు, బూరుగడ్డ కందాళై వెంకటకృష్ణమాచార్యులు ఆధ్వర్యంలో ఆచార్య సందీప్, ప్రసాద్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ భక్తమండలి చైర్మన్ జూలకంటి సతీష్ కుమార్, కార్పొరేటర్ రుద్ర గాని శ్రీదేవి ఉపేందర్, ఈడే శ్రీను, వంగవీటి అశోక్, జంగం రాము పాల్గొన్నారు.

రైతులకిచ్చిన ప్రతీ హామీని అమలు చేయాలి



ఖమ్మంరూరల్: తహసీల్దార్ రాంప్రసాద్‌కు వినతిపత్రం అందజేస్తున్న రైతుసంఘం నాయకులు



కూసుమంచిలో..



కామేపల్లిలో..



తిరుమలాయపాలెంలో..

ఖమ్మంరూరల్: రైతులపై గత ప్రభుత్వం అనుసరించిన విధానాలే కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అనుసరిస్తే రైతుల ఆగ్రహానికి గురికాక తప్పదని, రైతులకిచ్చిన ప్రతీ హామీని అమలు చేయాలని సీపీఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్ ఎండీ.మౌలానా అన్నారు. సోమవారం రూరల్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట పార్టీ అనుబంధ సంఘమైన ఏఐకేఎస్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ పి.రాంప్రసాద్‌కు వినతిపత్రం అందించారు. ఎం.శ్రీనాథ్‌రెడ్డి, మిడకంటి చినవెంకటరెడ్డి, వెన్నం భాస్కర్, బాణోత్ రాంకోటి, కొయ్య సీతయ్య, పెదవెంకటరెడ్డి, మామిడి. శంకర్ పాల్గొన్నారు.

రుమలాయపాలెం: రాష్ట్రంలో కాంగ్రెస్ హయాంలో రైతులకు అన్యాయం జరిగిందని, కొంత మంది రైతులకు మాఫీ చేసి రైతులను ఇబ్బందికి గురి చేస్తున్నారని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర సంఘం (ఏఐకేఎస్) పిలుపు మేరకు ఎన్నికల హామీలను వెంటనే నెరవేర్చాలని స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. పార్టీ మండల కార్యదర్శి రాధాకృష్ణ, నాయకులు శంకరయ్య, పగిళ్ల వీరభద్రం, బాలరాజు, శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, వెంకటేశ్వరరావు, రంజిత్, గంటా కృష్ణ, వీరభద్రం తదితరులు పాల్గొన్నారు.

కూసుమంచి: రైతులకు ఇచ్చిన హామీలన్ని నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ సీపీఐ అనుబంధ రైతుసంఘం ఆధ్వర్యంలో స్థానిక తహసీల్ ఎదుల ధర్నా నిర్వహించి అధికారులకు వినతిపత్రం అందజేశారు. జిల్లా నాయకులు, గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆజ్మీరా రామ్మూర్తి నాయక్, మల్లేష్, నర్సింహా, శ్రీకాంత్, వీరబాబు, రామ్మూర్తి, మంగీలాల్, యాదగిరి, అరుణ తదితరులు పాల్గొన్నారు.

నేలకొండపల్లి: షరతు లేకుండా రూ.2 లక్షల రుణమాఫీ చేయాలని కోరుతూ తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టి రెవెన్యూ అధికారులకు వినతిపత్రం అందించారు. మాజీ ఎంపీపీ రచ్చా నరసింహారావు, జిల్లా నాయకులు గుడవర్తి నాగేశ్వరరావు, రావెళ్ల అజయ్‌కుమార్, దండా సూర్యానారాయణ, యలమద్ది లెనిన్, మందడపు మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కామేపల్లి: రైతులందరికీ రుణమాఫీ వర్తింపజేయాలని రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. సంఘం ఆధ్వర్యాన తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేసి అనంతరం అధికారులకు వినతిపత్రం అందించారు. శతకోటి సత్యనారాయణ, సిరిపురపు ప్రభాకర్, కేసగాని తిరుపతయ్య, ఏపూరి లతాదేవి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నోట్‌బుక్స్ పంపిణీ



నోట్‌బుక్స్‌తో విద్యార్థులు, తదితరులు

తిరుమలాయపాలెం: మండలంలోని పైనంపల్లి జెడ్పీహెచ్ఎస్ పాఠశాల పదో తరగతి విద్యార్థులకు ఖమ్మం కైట్స్ అకాడమీ డైరెక్టర్ తిరుపతి నోట్‌బుక్స్, విద్యార్థుల అల్పాహారానికి రూ.10 వేల ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... వార్షిక పరీక్షల్లో పాఠశాల నుంచి ప్రతిభ కనబరిస్తే నగదు ప్రోత్సాహకాలు ఇస్తామన్నారు. ఉపేందర్, నగేష్, దారావత్ జయరాం, బొల్లికొండ రాజశేఖర్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అయ్యప్ప మాలధారుల ఇరుముడి

రఘునాథపాలెం: మండలంలోని మంచుకొండలో సోమవారం అయ్యప్ప మాలధారుల ఇరుముడి కార్యక్రమం సోమవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా గురుస్వాములు తిరుపయ్యస్వామి, కేశా రమేష్, జాటోత్ రాము, లాలు, చందులాల్, రమేష్, సికిందర్, రామకృష్ణ ఆధ్వర్యంలో ఇరుముడి ధరించి శబరిమలైకు బయలుదేరారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడికి గాయాలు

నేలకొండపల్లి: గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టడంతో వృద్ధుడికి తీవ్ర గాయాలైన ఘటన టోల్‌గేట్ వద్ద సోమవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని తిరుమలాపురం గ్రామానికి చెందిన భూక్యా లాక్యాను టోల్‌గేట్ సమీపంలో రోడ్డు దాటుతుండగా కోదాడ వైపు వెళ్తున్న గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో లాక్యాకు తీవ్ర గాయాలవ్వగా చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.

వాచ్‌కు బదులుగా టీషర్ట్.!

నేలకొండపల్లి: ఆన్‌లైన్‌లో వాచ్‌బుక్ చేస్తే రెండు పర్యాయాలు వస్తువులు మారగా వినియోగదారుడు ఖంగుతిన్న ఘటన మండలంలోని అనంతనగర్ గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన ఎం.వెంకటేశ్వర్లు ఈ నెల 5న ఆన్‌లైన్‌లో రూ.2,200 విలువ కలిగిన వాచ్‌ను బుక్ చేసుకున్నాడు. కాగా 8న ఆన ఆర్డర్‌పై వచ్చిన ప్యాకింగ్‌లో చిన్న పిల్లల టీషర్టు రాగా, దాన్ని తిప్పి పంపి మళ్లీ బుక్ చేయగా రెండో సారి సోమవారం హియర్ ఫోన్ వచ్చింది. తన డబ్బులు తిరిగి ఇప్పించాలని లేకుంటే , కోర్టును ఆశ్రయిస్తానని సంస్థ ప్రతినిధులకు కోరినట్టు బాధితుడు తెలిపాడు.

వంద పడకల ఆస్పత్రిగా మార్చాలి

నేలకొండపల్లి: స్థానిక సీహెచ్‌సీని వంద పడకల ఆస్పత్రిగా మార్చాలని సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ పాలేరు డివిజన్ కార్యదర్శి పగిడికత్తుల రామదాసు డిమాండ్ చేశారు. ఈ మేరకు సమస్యలు పరిష్కరించాలని కోరతూ ఆర్‌ఐ మధుసూదన్‌రావుకు సోమవారం వినతిపత్రం అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. బస్టాండ్‌లోకి బస్సులు రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో చిర్రా బిక్షం, పిచ్చయ్య, శ్రీనివాస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నగరంలో సినిమాలు

తిరుమల	పుష్ప-2
వినోద	పుష్ప-2
సాయిరాం	మిస్ యూ
ఆదిత్య	పుష్ప-2
శ్రీనివాస	పని
సినీ గెలాక్సీ	పుష్ప-2

- ఖమ్మం గాంధీచౌక్

ఖమ్మం రైతుబజార్, సమీకృత మార్కెట్

కూరగాయలు కేజీ ధర (రూ.ల్లో)		ఆకుకూరల కట్టలు (రూ.ల్లో)	
టమాట	20	బచ్చలికూర	3
వంకాయ	34		20
బెండకాయ	40	పాలకూర	3
పచ్చిమిర్చి	34		20
కాకర	38	చుక్కకూర	3
బోడ కాకర	120		20
బీర	58	తోటకూర	3
దొండ	46		20
పొట్లకాయ	38	గోంగూర	4
చిక్కుడు	48		20
గోరుచిక్కుడు	38	మెంతికూర	2
క్యాబేజీ	24		20
క్యాలీఫ్లవర్	30	కొత్తిమీర	1
ఆలుగడ్డ	38		40
చామగడ్డ	48	పుదీన	1
క్యారెట్	58		25
క్యాప్సికం	64	-ఖమ్మం వ్యవసాయం	